క్లుప్తంగా

వేములదీవి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేముల దీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణంతో పాటు ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ఆవరణలో భక్తులకు కోమటితిప్ప గ్రామానికి చెందిన తిరుమాని నర్సింహస్వామి, భీమరాజు సుబ్బారావు, ఆంజనేయులు కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు వెయ్యిమందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



21వ వార్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య

నరసాపురం: వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ అధికారులకు సూచించారు. శనివారం కమిషనర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా లోపాలపై ప్రజలతో మాట్లాడారు. డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపునకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా చెత్తకుప్పలు కనిపించకూడదని ఆదేశించారు. ఇళ్లలో తడి, పొడి, ప్రమాదకర చెత్తలను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ హోమం



వాసవీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో శనివారం వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహారాష్ట్ర నాందేడ్ నుంచి వచ్చి భక్తులు 102 అడుగుల రుషీ గోత్ర మందిరంలోని 90 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాల స్వామి) పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శిష్టామణికంఠ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు, దంపతుల పూజలు నిర్వహించారు. వాసవీ శాంతి ధాం ప్రాంగణంలోని యాగశాలలో వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

గుండె వ్యాధి బాధితుడికి సాయం



బాధితుడికి నగదు అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. శనివారం స్థానిక కొత్త కుళాయి చెరువు గట్టు వద్ద వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న షేక్ లియాఖత్ ఆలీకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. విద్య, వైద్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు వాకర్స్ క్లబ్ సహాయసహకారాలు అందిస్తుందని క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు, ధనాని శ్రీరామమూర్తి, జంపన నాగేంద్ర ప్రసాద్, చామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రోటరీ క్లబ్ ప్రమాణ స్వీకారం

నరసాపురం: రోటరీక్లబ్ నరసాపురం శాఖ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహిస్తామని నూతన అధ్యక్షురాలు ఆత్మూరి రమ, కార్యదర్శి కేజీఎస్ఎల్ కుమారి తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు వైఎన్ కాలేజ్ సెమినార్‌హాల్‌లో ప్రమాణ స్వీకారం ఉంటుందని స్పష్టం చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్, అసిస్టెంట్ గవర్నర్ గన్నాబత్తుల సత్యవతి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

వానా కాలం.. మూగజీవాలకు గడ్డు కాలం

- వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశు వైద్యులు



మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకలు

యలమంచిలి: మూగజీవాలకు వానా కాలంలో గడ్డు కాలంగా ఉంటుంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలను ఆరుబయట ఉంచడంవల్ల కొన్నిరకాల వైరస్‌లు సోకి ఎక్కువగా వ్యాధుల బారిన పడుతుంటాయి. సకాలంలో వైద్యం అందించకపోతే చనిపోతుంటాయి. జిల్లాలో 5,35,276 గొర్రెలు, మేకలు ఉండగా వాటిల్లో గొర్రెలు 4,19,314 మేకలు 1,15,962 ఉన్నాయి. జీవాల ఆరోగ్యం విషయంలో పెంపకందారులు అప్రమత్తంగాఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. పోషణతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలని వివరిస్తున్నారు. వాతావరణం చల్లగా ఉండటం, వర్షం కురవడంవల్ల శరీర స్థితి బాగా లేని గొర్రెలు, మేకలు ఈ కాలంలో తొందరగా వ్యాధుల బారిన పడతాయని చెబుతున్నారు. పారుడు, మశూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల వల్ల తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది.

అపరిశుభ్రతతో న్యుమోనియా

జీవాలను ఆరుబయట ఉంచడం, పాకలు పరిశుభ్రంగా లేకపోవడం, దుమ్మూ ధూళితో నిండి ఉండడం, పాకల్లో పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం వల్ల న్యుమోనియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారడం ఎక్కువగా కనిపిస్తుంది. సరిగ్గా మేత మేయకపోవడం వల్ల జీవాలు నీరసించిపోతాయి. ఒకటి నుంచి తొమ్మిది నెలల వయసున్న గొర్రె, మేక పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తాయి. వ్యాధి నివారణకు గాలి, వెలుతురు బాగా వచ్చే పాకల్లో జీవాలను ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్నాకే మందలో కలపాలని వివరిస్తున్నారు.

మశూచి/బొబ్బ రోగం..

ఈ వ్యాధి వైరస్ వల్ల ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకల చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్ర జ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంది. శ్వాస సరిగ్గా తీసుకోలేక వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పుండ్లపై వేప నూనె లేదా పశు వైద్యులు సూచించిన మందులను పూయాలి.

నీలి నాలుక వ్యాధి

ప్రధానంగా ఈ వ్యాధి గొర్రెల్లో కనిపిస్తుంది. చీకటీగల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. వర్షాకాలంలో చీకటీగలు ఎక్కువగా వృద్ధి చెందుతుంటాయి. గాలి ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరి వ్యాధిని వ్యాపింపజేస్తాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారుతుంది. నోరు, నాలిక వాచి నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడటం వల్ల జీవాలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కాలి గిట్టలు, చర్మం కలిసే దగ్గర వాపు వచ్చి జీవాలు కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే మరణిస్తాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు. జీవాలు ఉండే పాకల దగ్గర మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలి.

తిక్క (సర్వ) రోగం..

వర్షా కాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది. వ్యాధిని త్వరగా గుర్తించకపోతే జీవాలు మృతి చెందే అవకాశం ఎక్కువ. పాకాల వద్ద సాయంత్రం పూట వేపాకు ధూపం వేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి



వర్షా కాలంలో సాధారణంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జీవాలు నీరసంగా ఉన్నా, మేత మేయకపోయినా అశ్రద్ధ చేయకుండా వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి. వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. పశు వైద్యుల సూచనలు మేరకు మందులు వాడుతూ సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మండల పశు వైద్యాధికారి, యలమంచిలి

ముందుజాగ్రత్తతో ముప్పు నుంచి రక్షణ

- గొర్రెలు, మేకలనుఉంచే పాకల్లోకి చలిగాలి రాకుండా చర్యలుతీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- జీవాలను వర్షంలో, ఆరుబయట ఉంచకూడదు.
- గడ్డిపై వర్షపు నీరు ఆరిన తర్వాత సూర్యరశ్మి వచ్చాక మేతకు విడిచిపెట్టాలి.
- ఈతకువచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి.
- శరీర ఉష్ణ నిర్వహణకు పీచు పదార్థంతో ఉండే మేతను అందించాలి
- గొర్రెలను, మేకలను కట్టే ప్రదేశాలను తరచూ మారుస్తూ ఉండాలి.
- మృతిచెందిన గొర్రెలు, మేకలు తిన్నగడ్డిని, ఆహారాన్ని మిగతావాటికి వేయకుండా కాల్చివేయాలి.

తరగతుల నిర్వహణ అడ్డగింత

నరసాపురం: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో రెండో శనివారం సెలవు రోజు కూడా తరగతులు నిర్వహిస్తుండటంతో అక్కడికి చేరుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు తరగతుల నిర్వహణను అడ్డుకుని విద్యార్థులను పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో అనేక ప్రైవేట్ కళాశాలలు సెలవు రోజుల్లోకూడా తరగతులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. అలాంటి కళాశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ధీరజ్, చందు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

పెనుగొండ: దేశంలో పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శనివారం ఆచంట వేమవరం, పెనుమంచిలిల్లో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోసెఫ్ సోనీ, శ్యాస్, అమల, చిల్లే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జయహో ఛత్రపతి శివాజీ' నాటక ప్రదర్శన

నరసాపురం: స్థానిక వైఎన్ కళాశాల అరబిందో ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సంస్కార భారతి, కళాసాహిత్యాల అఖిల భారత సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ చారిత్రక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు. నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని శనివారం నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు. 60 మంది కళాకారులతో అధునాతన టెక్నాలజీతో కూడిన హంగులతో ఈ నాటక ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేశారు.

మహిళా జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి దుర్మార్గం

ఉండి: గుడివాడలో పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన గుండాల దాడి దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ రాష్ట్ర కార్యదర్శి బడుగు బాలాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దాడి ద్వారా రాష్ట్రంలోని మహిళలకు రక్షణ లేదని మరోసారి టీడీపీ, జనసేన రౌడీలు నిరూపించారని మండిపడ్డారు. ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ విధంగా మహిళా ప్రజాప్రతినిధులపై దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనకు కారణమైన బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వెంకట రాయుడికి అభినందనలు



వెంకట రాయుడిని అభినందిస్తున్న దృశ్యం

వీరవాసరం: వైఎస్సార్ సీపీ భీమవరం ఇన్‌చార్జి చినమిల్లి వెంకట రాయుడును పార్టీ పంచాయతీ రాజ్ విభాగం వీరవాసరం మండల నూతన అధ్యక్షుడు పులగం సుబ్రహ్మణ్యం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి నిత్యం కృషి చేయాలని వెంకటరాయుడు సుబ్రహ్మణ్యంకు సూచించారు. తనకు పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజుకు ఇతర నేతలకు సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కర్ర ప్రకాశరావు, జి.చంద్రరావు, జి.గణేష్,. జి.శివ, తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి



పశుపోషణపై అవగాహన భార్గవీ సత్య

ఆకివీడు: అధిక పాల దిగుబడికి రైతులు పశుపోషణలో జాగ్రత్తలు పాటించాలని మండల పశుసంవర్థక శాఖ అధికారిణి కెల్లా భార్గవీ సత్య అన్నారు. మండలంలోని అయిభీమవరం, గుమ్ములూరు గ్రామాల్లో శనివారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక పాల దిగుబడికి నాణ్యమైన పశుగ్రాసాన్ని పశువులకు అందించాలన్నారు. ఆరోగ్యకరమైన పెయ్యి దూడలు సకాలంలో ఎదకు వస్తాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం, పశుసంవర్థక శాఖ సంయుక్తంగా పశుగ్రాస ఉత్పత్తులను నూరు శాతం సబ్సిడీకి రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. 10 సెంట్ల నుంచి 50 సెంట్ల భూమిలో పథకం ద్వారా పశుగ్రాసాన్ని పెంచవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏహెచ్ఏఎస్ అమృత, అమూల్య, మహేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేక అవస్థలు

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్‌గా ఉంది. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయింది. రద్దీగా ఉండే ఈ ప్రాంతం మీదుగా వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు.

గుంతలో పడి మహిళ మృతి

పాలకొల్లు సెంట్రల్: గోతుల రోడ్డులు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. పోడూరు మండలం పెనుమదం రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ గోతిలో పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. శనివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు పట్టణం రామయ్యహోలు వద్ద నివాసం ఉంటున్న దిగమర్తి ప్రమీల (37) రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయలుదేరి పెనుమదంలో ఉన్న చర్చికి వెళ్తుంది. పెనుమదం ఊరి చివర రోడ్డులో పెద్ద గొయ్య ఉండడంతో వాహనాన్ని అదుపు చేయలేక ఆ గోతిలో పడిపోయింది. ఈ సంఘటనలో ఆమె తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి ఒక కుమార్తె ఉన్నారు. తండ్రి గనిరాజు ఇచ్చిన పిర్యాదు మేరకు ఏఎస్సై ఏసుబాబు కేసు నమోదు చేశారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలవల్ల మీ జీవితాలను నాశనం చేసుకోవద్దని పట్టణ ఎస్సై జిజె ప్రసాద్ అన్నారు. స్థానిక చాంబర్స్ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల విషయంలో విద్యార్థులకు ఓ యువతా మేలుకో అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ దుర్వ్యసనాలకు ఎప్పుడైతే ఆకర్షితులయ్యారో దాని అవసరాల కోసం ఒక తప్పుకు వంద తప్పులు చేయాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలు ఉన్నత స్థితిలో నిలబడాలనే ఆకాంక్షతో ఎన్నో కష్టాలు పడి చదివిస్తుంటారని వారి నమ్మకాలను ఒమ్ము చేయవద్దని అన్నారు. ఉన్నతమైన విద్యను అభ్యసించి, మంచి ఉత్తీర్ణత సాధించి, మీ తల్లిదండ్రులతో పాటు మీరు చదువుకున్న విద్యాలయాలకు మంచి గుర్తింపు గౌరవం తీసుకువచ్చేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మార్‌లింగం, కళాశాల ప్రిన్సిపాల్‌లు డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, కె నరసింహరావు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో....

పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి, నాటు సారా, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. స్థానిక ఎర్రవంతెన వద్ద ప్రజలకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సాగు నీరందించాలి



మాట్లాడుతున్న కేతా గోపాలన్

పెనుగొండ: సాగు నీరు లేక నారుమడు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శనివారం ఆచంట సీపీఎం మండలకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోడేరు బ్యాంక్ కెనాల్ నుంచి సాగునీరు సరిగా అందడం లేదన్నారు. అందువల్ల రైతులు వేసిన నారుమడులు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరిలో నీరు సమృద్ధిగా ఉన్నా పంట బోదెల్లో ఇంజన్లతో నీరు తోడుకోవాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడిందని వాపోయారు. కాలవల్లో నీటి మట్టాలు పడిపోవడంతో నాట్లు వేసేందుకు అనువుగా దమ్ములు చేసే పరిస్థితి లేదన్నారు. పంట బోదులు పూడకపోవడం, ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో శివారు భూములు ఎండిపోతున్నాయన్నారు. తక్షణం అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో సాగునీరు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు, మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లాబ్బాయి, ఎన్‌వీఎన్ శర్మ, గుత్తుల రంగారావు, కుసుమే జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం ఎదురుచూపులు

- కరుణించని వరుణుడు
- కాలువల్లోనూ నీరు లేని వైనం
- బీటలు వారుతున్న చేలు.. ఎండిపోతున్న నాట్లు
- ఆందోళనలో రైతన్నలు



పాలకోడేరు మండలం మోగల్లులో సాగు నీరు అందక బీటలు తీసిన వరి నారుమడి

పాలకోడేరు: వర్షాకాలం వచ్చినా వరుణుడు కరుణ చూపకపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. అప్పుడే జూలై మాసంలో రెండు వారాలు దాటుతున్నా వర్షాలు సక్రమంగా పడకపోవడం.. ఎండలు మండిపోతుండడంతో చేలకు అవసరమైన సాగు నీరు అందడం లేదు. దీంతో సకాలంలో నాట్లు పూర్తవుతాయో లేదనని ఉండి నియోజకవర్గంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత మూడు రోజులుగా మబ్బులు వేస్తున్నా వర్షాలు కురవకపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రారంభ దశలోనే నాట్లు

ఉండి నియోజకవర్గంలోని ఉండి మండలంలో 18,880 ఎకరాలు, కాళ్ల మండలంలో 3,900, పాలకోడేరు మండలంలో 10,400, ఆకివీడు మండలంలో 4100 ఎకరాలు కలిసి మొత్తం 29,280 ఎకరాల్లో వరి సాగు అవుతుంది. ప్రతి ఏడాది వరి సాగు చేసేందుకు జూలై మాసంలో పూర్తి శాతం ఆకుమడులు వేసేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. కనీసం 50 శాతం కూడా నారుమడులు వేసుకోలేని పరిస్థితి నెలకొందని రైతుల ఆందోళన చెందుతున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు, కోరుకొల్లు, గుత్తుల వారి పాలెం, గరగపర్రు తదితర గ్రామాల్లో సాగునీరు అందక నారుమడులు బీటలు వారుతున్నాయి. ఉండి మండలంలో ఉప్పులూరు, యండగండి, పెద్ద పుల్లేరు, కలిసిపూడి శివారు ప్రాంతాల్లో, అలాగే ఆకివీడు కాళ్ళ మండలాల్లోని శివారు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి సైతం నెలకొంది.

పట్టించుకోని అధికారులు

వరి సాగుకి రైతులు నారుమడులు వేసేందుకు సన్నద్ధం అవుతున్నా సాగునీరు అందించడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. సాగునీటిపై అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మరీ ముఖ్యంగా శివారు ప్రాంతాలకు కాలువల్లో నీరు పారడం లేదు. అధికారులు మాత్రం కాలువల్లో నీరు పుష్కలంగా ఉందని, నీరు ఎందుకు రావడం లేదని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

బీటలు వారుతున్న నారుమడులు

పాలకోడేరు మండలం మోగల్లు, కోరుకొల్లు తదితర గ్రామాల వరి పొలాలకు రేలంగి ఛానల్, బ్రాంచి కెనాల్ దక్షిణ కాలువల ద్వారా సాగునీరు అందాలి. అయితే దక్షిణ కాలువలో నీటి ప్రవాహం లేక వరి పొలాలకు నీరు చేరడం లేదు. దాంతో ఈ కాలువ ఆనుకొని ఉన్న వరి పొలాల్లో నారుమడులు బీటలు వారాయి. సాగునీరు అందక నారుమడులు వేసుకోలేని పరిస్థితి నెలకొందని మరికొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల నారుమడులు ఎండిపోతుంటే ఇంజన్ల ద్వారా నీరు తోడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ప్రాథమిక దశ నుంచే పెట్టుబడి ఎక్కువ అయిపోతుందని ఇలా అయితే వరి సాగు చేసేది ఎలా అని రైతులు దిగాలు చెందుతున్నారు.

కాలువల్లో నీటి ప్రవాహం లేదు



కాలువల్లో నీటి ప్రవాహం లేక చెత్తాచెదారంతో నిండిపోయింది. అలాంటప్పుడు వరి పొలాలకు నీరు ఎలా వస్తుంది. నీటి ప్రవాహం పెంచితేనే గాని నీరందే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గుమ్మళ్ళ రంగ, రైతు, మోగల్లు

మోటార్ ఇంజన్ ద్వారా నీరు తోడుకుంటున్నాం



నారుమడులు వేశాం.. నీరందడం లేదు. దీంతో మోటార్ ఇంజన్ల ద్వారా నీరు తోడుకుంటున్నాం. సాగు మొదల నుంచి నీటికే పెట్టుబడి పెట్టాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇలాగైతే వరి సాగు చేసేదెలా.

– చింతపల్లి శ్రీను, రైతు, మోగల్లు



మొగల్లులో నీటి ప్రవాహం లేని దక్షిణ కాలువ



మొగల్లులో వరి నారుమడికి నీరు తోడేందుకు ఇంజన్ ఏర్పాటు చేసిన దృశ్యం

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

వీరవాసరం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం భీమవరం వచ్చిన ఆయన ఇటీవల రాజ్యసభ సభ్యులుగా నియమితులైన పాక సత్యనారాయణ నివాసానికి వెళ్లి ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం గణేష్ భవానీ యాదవ్‌ను సత్యనారాయణ సత్కరించారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం



కృపావతికి నగదు అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని కట్టుపాలెం గ్రామానికి చెందిన విప్పర్తి కృపావతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆమెకు వైద్య సహాయం నిమిత్తం రూ. 19,000 అందజేశారు. జై భీమ్ యువసేన ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గెడ్డం సునీల్, గౌరవ అధ్యక్షుడు భవాని ప్రసాద్, జీవన్ జ్యోతి ట్రస్ట్ అధ్యక్షుడు శామ్యూల్ పుల్లారావు, శిరగాలపల్లి ఎంపీపీ స్కూల్ హెచ్ఎం విప్పర్తి రవిచంద్రన్, సదమళ్ళ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.